అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 327 | వరంగల్ | మంగళవారం, 06 అక్టోబర్ 2026 | పేజీలు: 05



ఈ పోరాటం ఆగదు..

ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియపై తలెత్తిన ఆరోపణల నేపథ్యంలో విపక్షాల ఆందోళన మరింత ఉధృతమైంది. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలో అవకతవకలకు బాధ్యులైనవారెవరైనా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. - అక్షరశక్తి, డెస్క్



- 300 మందికి పైగా ఎంపీలను ఎందుకు అడ్డుకున్నారు?
- ఎన్నికల కమిషనర్లను కలవడం మా హక్కు.. ప్రజల ప్రతినిధులం
- 'జ్ఞానేశ్.. ఇక రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది'
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం: రాహుల్‌గాంధీ

బాధ్యులు తప్పించుకోలేరు!

ఓటర్ల జాబితా అక్రమాలపై రాహుల్‌గాంధీ ఘాటు హెచ్చరిక

4

గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలి

- త్వరగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో తనిఖీలు
- వైద్య సేవలు, వసతుల పరిశీలన



2

ఏసీబీకి చిక్కిన కార్యదర్శి, కారోబార్

అక్షరశక్తి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ట్రాప్ నిర్వహించారు. రెండు ఇళ్ల మ్యుటేషన్ దరఖాస్తుల ఫైళ్లను ప్రాసెస్ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి బి.అరుణ, కాంట్రాక్ట్ కారోబార్ దాసరి సంతోష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మ్యుటేషన్ ఫైళ్లను ప్రాసెస్ చేసేందుకు తొలుత రూ.20 వేలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అనంతరం రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. కార్యదర్శి సూచన మేరకు కారోబార్ సంతోష్ లంచం నగదు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టారు.





స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

అక్షరశక్తి, హన్మకొండ : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రభుత్వ వృత్తివిద్య జూనియర్ కళాశాల, హనుమకొండలో "స్వచ్ఛత హి సేవ" కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల వాలంటీర్లు కళాశాల ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం మరియు స్వచ్ఛతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని, స్వచ్ఛతను కేవలం కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంలో వలంటీర్ల పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఆర్. ప్రవీణ్ కుమార్, డా.సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోకిరీలపై కఠిన చర్యలు

క్రైమ్ ఏసీపీ సదయ్య



అక్షరశక్తి, వరంగల్: మహిళలు, బాలికలను వేధించే పోకిరీలు, ఆకతాయిలపై కఠిన చర్యలు తప్పవని క్రైమ్ ఏసీపీ సదయ్య హెచ్చరించారు. మంగళవారం దేశాయిపేటలోని చంద్రకాంతయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకునే విషయంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, ఒంటరిగా ప్రయాణించే మహిళలు టీసేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. మహిళలపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే ధైర్యంగా షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్ఐలు టీ.యాదగిరి, రామారావు, స్వాతి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

డెయిరీ ప్లాంట్ డిజైన్లు త్వరగా సిద్ధం చేయాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



అక్షరశక్తి, హనుమకొండ: దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ లేఅవుట్, నిర్మాణ డిజైన్లను త్వరగా సిద్ధం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డెయిరీ ప్లాంట్ సివిల్ పనులు, లేఅవుట్ ప్లాన్, బీఎంసీయూల కొనుగోలుపై చర్చించారు. నిర్మాణ డిజైన్లను వెంటనే పూర్తి చేసి పనుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సంగెం మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల కొనుగోలు ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో మేన శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్‌రావు, ఆరిజిన్ కన్సల్టెంట్ ప్రతినిధి వైవియన్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్‌రాయ్, డెయిరీ మేనేజర్లు కృష్ణ, సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలి

- **త్వరగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో తనిఖీలు**
- **వైద్య సేవలు, వసతుల పరిశీలన**





అక్షరశక్తి, హన్మకొండ : ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్)లోని వివిధ విభాగాల్లో విస్తృత తనిఖీలు చేసి గర్భిణీలు, బాలింతలు, మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని వసతులను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవల నిమిత్తం అక్కడికి వచ్చిన గర్భిణీ, బాలింతలతో కలెక్టర్ మాట్లాడి అందుతున్న వైద్య సేవలపైన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఓపీ వివరాలను ఆన్ లైన్ చేస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, గర్భిణులకు సంబంధించిన వివిధ పరీక్షల వివరాలు, నమూనాల సేకరణ విధానం, టెస్ట్ రిపోర్ట్ అందించే సమయం గురించి వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గైనకాలజీ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య, ఎంతమంది వైద్యుల అందుబాటులో ఉంటున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ రూమ్‌లో పరికరాల పనితీరు, టెస్ట్ రిపోర్ట్స్ ఇచ్చే విధానాన్ని పరిశీలించారు. లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లలో ఉన్న ఏర్పాట్లు, శుభ్రత, పరికరాల నిర్వహణపై ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో మందుల నిల్వలు, వైద్య పరికరాలు, శస్త్ర చికిత్స సామగ్రి, వినియోగ వస్తువుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య, విధుల కేటాయింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భిణులు, బాలింతలు ఎక్కువసేపు వేచి ఉండకుండా ఆరోగ్య పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా అందించాలని సూచించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న అన్ని పరీక్షల రిపోర్టులను జాప్యం లేకుండా ఇవ్వాలన్నారు. ప్రసూతి, వైద్య సేవల్లో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ ప్రాంగణం, ల్యాబ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఆసుపత్రి ఆవరణ నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా..ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ డాక్టర్ లు కలెక్టర్ కి ఆసుపత్రి వివరాలను అలాగే అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ వివరించారు

కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- **హనుమకొండ కలెక్టర్‌కు 100 మంది గుడిసె వాసుల సంతకాలతో వినతి**



అక్షరశక్తి, హనుమకొండ కలెక్టరేట్: కాజీపేట చౌరస్తాను ఆనుకుని ఉన్న కడిపికొండ శివారు సర్వే నంబర్లు 71, 72, 73లోని ప్రభుత్వ సీలింగ్ భూమిలో గత 22 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు నివాస స్థలాలపై పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ గారిని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పసునూరి మనోహర్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుస్ తో పాటు కాజీపేట వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులు పాల్గొన్నారు. సుమారు 100 మంది గుడిసె వాసులు తమ సంతకాలు చేసి, అందరూ కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సుమారు 2005 సంవత్సరం నుంచి వైఎస్ఆర్ నగర్‌లోని సర్వే నంబర్లు 71, 72, 73లో గుడిసెలు ఏర్పాటు చేసుకుని పేద, బలహీన వర్గాల కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలకు మున్సిపల్ ఇంటి నంబర్లు కూడా మంజూరయ్యాయని, వాటి ఆధారంగా ఆధార్, రేషన్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు తదితర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఇదే చిరునామాతో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 22 సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటివరకు తమ నివాస స్థలాలకు పట్టాలు మంజూరు కాలేదని, దీంతో పేద కుటుంబాలు భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులతో స్థల పరిశీలన, సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులకు నివాస స్థలాలపై పట్టాలు/హక్కు పత్రాలు మంజూరు చేయాలని, అలాగే అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి శాశ్వత నివాస భద్రత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. పేద, బలహీన వర్గాల గుడిసె వాసుల సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, త్వరితగతిన అధికారులతో విచారణ జరిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది వైఎస్ఆర్ నగర్ గుడిసె వాసులు సంతకాలతో కలిసి, వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెంచల్‌చెరువుపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం

- రూ.8.3 కోట్లతో సీసీపల్లి–కాచపల్లి–మైసంపల్లి రహదారి
- మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షరశక్తి, హుస్నాబాద్: 'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెంచల్‌చెరువుపల్లిలో పర్యటించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.21 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్‌లు, గ్రామపంచాయతీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్, ఏపీఐపీ, జెడ్పీ నిధులతో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు, రైతులు పొలాల్లో ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని, సమీపంలోని నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీ ద్వారా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. సీసీపల్లి-కాచపల్లి-మైసంపల్లి రహదారి నిర్మాణానికి రూ.8.3 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు 500 స్టీల్ పాత్రలను స్టీల్ బ్యాంక్ ద్వారా అందించినట్లు తెలిపారు. బతుకమ్మ ఘాట్, హైమాస్ట్ లైట్లు, హైస్కూల్ ప్రహరీ, శ్మశానవాటిక తదితర పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు త్వరలో అందుబాటులోకి వస్తుందని, భూములు కోల్పోయిన 118 మంది రైతులకు చెందిన 2,134 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. చెంచల్‌చెరువుపల్లికి 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎల్లవేణి కమల, మెతుకు జ్యోతిలకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్, హుస్నాబాద్ ఆర్డీవో, డీఆర్‌డీవో, డీపీవో, తిమ్మాపూర్ సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌కు సంక్షేమం.. ఎన్టీఆర్ నగర్‌కు అభివృద్ధి





- స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అక్షరశక్తి, వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి-షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు కార్డులు, చెక్కులు అందజేశారు. అనంతరం ఎన్టీఆర్ నగర్‌లో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య, ఎస్సీ సెల్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, మాజీ పాక్స్ చైర్మన్ బుద్దే పెద్దన్న, నాయకులు జానీ, శంకర్, రాజేష్, శివపటేల్, స్టాలిన్, పైసా మహేష్, పిట్ట సుధీర్, సయ్యజి, కడప నాగలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పైడిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలో నిర్వహించిన స్మార్ట్‌రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి-షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కార్డులు, చెక్కులను అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పైడిపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణకర్, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, మాజీ పాక్స్ చైర్మన్ బుద్దే పెద్దన్న, నాయకులు అభిషేకం, సంపత్, రవికుమార్, రాజు, వంశీ, బోయినీ ఐలయ్య, గట్టు బాలరాజు, జాన్సన్, నవీన్, సతీష్, ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేయూలో వెయ్యి మొక్కలు..

- జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయంలోని కేయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో పచ్చదనం, జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా వెయ్యి మొక్కలు నాటారు. జెన్‌పాక్ట్ సీఎస్‌ఆర్ నిధుల సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 10 రకాల మొక్కలను నాటారు. వీటిని రాబోయే మూడేళ్లపాటు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, జెన్‌పాక్ట్ సంస్థలు సంరక్షించనున్నాయి. కార్యక్రమంలో కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్, డీవో ప్రొఫెసర్ వెంకయ్య, ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, అవెన్యూ ప్లాంటేషన్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటగోపీనాథ్, యూహెచ్‌డబ్ల్యూ ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, దీపక్, జెన్‌పాక్ట్ ప్రతినిధి రాధాకృష్ణపటేల్, డాక్టర్ అసీం ఇక్బాల్, అధ్యాపకులు, సుమారు 100 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కార్పొరేట్, విద్యా, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు మరింత దోహదం జరుగుతుందని అన్నారు.



కేయూ దూరవిద్య పీజీ పరీక్ష వాయిదా

అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం (సీడీఓఈ) ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించాల్సిన పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష వాయిదా పడింది. వాయిదా వేసిన పరీక్షను ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. మిగిలిన పేపర్ల పరీక్షా షెడ్యూల్, పరీక్ష సమయాలు, కేంద్రాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు మార్పును గమనించి పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

లేకుంటే నిరవధిక సమ్మె: గోనే యువరాజు



అక్షరశక్తి, వరంగల్: ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఆశా వర్కర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఆశా వర్కర్లపై అదనపు పనిభారం మోపొద్దని, ఏఎన్‌సీ టార్గెట్ల పేరుతో వేధింపులకు గురిచేయొద్దని డిమాండ్ చేశారు. సబ్ సెంటర్ డ్యూటీలు చేయాలని కొందరు వైద్యాధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, ప్రధాన కార్యదర్శి సంధ్య, నాయకురాళ్లు సుజాత, రమ, రజిత, రమ్య, జ్యోతి, కవిత, జ్యోత్స్న, సృజన తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అక్షరశక్తి,నర్సంపేట : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు. మంగళవారం బుదరావుపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. భవనం వద్ద భద్రత దృష్ట్యా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి బాలును ఆదేశించారు. అనంతరం రాగంపేట, రంగాపూర్ గ్రామపంచాయతీల్లో VO భవనాల నిర్మాణ పురోగతిని పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో ఎంపీడీవో, ఏఈ పీఆర్ ఉదయ్, పంచాయతీ కార్యదర్శులు బాలు, అబేదా, రాగంపేట సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి



అక్షరశక్తి, హనుమకొండ: గవర్నర్ కోటాలో ప్రముఖ వైద్యులు, ప్రజాసేవకులు డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని తెలంగాణ మాదిగ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ స్వామి మాదిగ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. డాక్టర్ రామకృష్ణ ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, దళిత, బహుజన సంక్షేమం కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా ఆయనకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మద్దతుగా సిఫారసు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు మొగిలి, ఉపాధ్యక్షుడు సిలువేరు సుధాకర్, సంఘ నాయకులు బొడ్డు రమణ, కొత్తూరు అంజి, చిరిపల్లి భరత్, ఎర్ర అనిల్, గడ్డం రిశ్విక్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోరీ

శ్రమ మేము చేస్తే
సంపద మీరు దోస్తిరి
అంటరాని తనంతో
బానిసలను చేస్తిరి
అధర్మాన్ని ధర్మాన్ని చేస్తిరి
కులం కుట్రలతో
నియంతృత్వ కోటలు కడ్తిరి
మా చరిత్రను తగలబెడితిరి
కుటిల కట్టు కథలల్లితిరి
ఈ గడ్డన పుట్టిన మమ్ముల
వలసొచ్చి పాలిస్తుంటిరి
బుద్ధుడు చెప్పిన బుద్ధిని
బొంద పెడితిరి
మా తక్షశిలను తగలబెడితిరి
నలందాను నాశనం చేస్తిరి
లక్షల బౌద్ధులను చంపితిరి
తరాలు మారినా మీ తత్వం
మారదాయే
ఇంకా ఆ కుటిల నీతి పాదాయే
బాబాసాహెబ్ బండూక్ ను (ఓటు)
చోరీ చేస్తుంటే
చూస్తూ ఉండడానికి
మీ జమానా కాదు
ఇది జై భీమ్ జమానా
జిల్ల పురుగులే
గర్జించే పులులై
దండయాత్ర చేస్తయి
నీ నియంత పేక మెడలు కూల్చుతై
జర పైలం పాలకుడా ....



-దండెంపెల్లి సురేందర్
అడ్వకేట్

ఈ పోరాటం ఆగదు..
బాధ్యులు తప్పించుకోలేరు!

- ఓటర్ల జాబితా అక్రమాలపై రాహుల్‌గాంధీ ఘాటు హెచ్చరిక
- 300 మందికి పైగా ఎంపీలను ఎందుకు అడ్డుకున్నారు?
- ఎన్నికల కమిషనర్లను కలవడం మా హక్కు.. ప్రజల ప్రతినిధులం
- 'జ్ఞానేశ్.. ఇక రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది'
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం: రాహుల్‌గాంధీ





అక్షరశక్తి, డెస్క్ : ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియపై తలెత్తిన ఆరోపణల నేపథ్యంలో విపక్షాల ఆందోళన మరింత ఉధృతమైంది. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన మార్చ్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటర్ల జాబితాలో అవకతవకలకు బాధ్యులైనవారెవరైనా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈసీ కార్యాలయం వద్ద ఆందోళన

పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం మార్చ్ నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా సవరణపై తమ అభ్యంతరాలను ఎన్నికల కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లాలని వారు డిమాండ్ చేశారు. అయితే నితి ఆయోగ్ సమీపంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో విపక్ష ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆందోళన మరింత కొనసాగింది.

'300 మంది ఎంపీలను ఎందుకు అడ్డుకున్నారు?'

పోలీసులు అడ్డుకోవడంపై రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు పార్లమెంట్ నుంచి 300 మందికి పైగా విపక్ష ఎంపీలు వచ్చారని, తాము కోట్లాది మంది భారతీయులకు ప్రతినిధులమని అన్నారు. ఎన్నికల సంఘం కార్యాలయం కొద్ది దూరంలోనే ఉన్నప్పటికీ తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లను కలిసి తమ అభిప్రాయాలను చెప్పడం ప్రజాప్రతినిధులుగా తమ హక్కు అని పేర్కొన్నారు. పోలీసులు తమను అడ్డుకోవడం, బెదిరించడం ఎందుకని ప్రశ్నించారు.

'జ్ఞానేశ్.. ఇక రాజీనామా చేయండి'

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. 'జ్ఞానేశ్.. ఇక అయిపోయింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది' అంటూ ఆయన బహిరంగంగా డిమాండ్ చేశారు. ఎన్నికల ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని విపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ నిరసన చేపట్టారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందేనని రాహుల్‌గాంధీ పట్టుబట్టారు.

'వారిని ఓడిస్తాం.. బాధ్యులు తప్పించుకోలేరు'

నిరసన సందర్భంగా బీజేపీపై కూడా రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 'మేము వారిని కేవలం ఎదుర్కోవడం కాదు.. వారిని ఓడిస్తాం' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిణామాలను తాను దేశద్రోహంగా భావిస్తున్నానని, దీనికి బాధ్యులైన వారు ఎవరైనా భవిష్యత్తులో తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే తమ పోరాటమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసం అత్యంత ముఖ్యమని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండకూడదని అన్నారు.

మరింత ఉధృతంగా విపక్షాల పోరాటం

ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ అంశాలపై విపక్షాలు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికల సంఘం, బీజేపీ మాత్రం ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ ఉద్దేశం లేదని, అనర్హమైన, డూప్లికేట్, మరణించిన వారి పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలో భాగంగానే మార్పులు జరుగుతున్నాయని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో విపక్షాలు చేపడుతున్న ఆందోళన రాజకీయంగా మరింత వేడెక్కింది. ఎన్నికల ప్రక్రియపై తమ అభ్యంతరాలకు స్పష్టమైన సమాధానాలు వచ్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్ష నేతలు చెబుతున్నారు.

ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి



అక్షరశక్తి, పరకాల : పరకాల ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడబ్ల్యూయూ-ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థుల తరపున పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. రీజియన్ క్లాస్ సీరియల్ నెంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నెంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి అభ్యర్థులకు ప్రతి ఒక్క కార్మికుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా పనిచేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలను అడ్డుకుని, వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా నిలిచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా, టీడబ్ల్యూయూ-ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో పరకాల ఆర్టీసీ డిపోను మరింత అభివృద్ధి చేసి, కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.

సఫాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అక్షరశక్తి, హైదరాబాద్: సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. భారత జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ (ఎన్‌సీఎస్‌కే) వైస్ చైర్మన్ హర్దీప్‌సింగ్ గిల్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సఫాయి కార్మికులను కాంట్రాక్టు విధానం నుంచి తొలగించి, ప్రభుత్వమే నేరుగా నెలసరి వేతనాలు చెల్లించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై యూనియన్ తరపున నాయకులు మాట్లాడారు. అనంతరం ఎన్‌సీఎస్‌కే వైస్ చైర్మన్ హర్దీప్‌సింగ్ గిల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ వాల్మీకి, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోదా రామకృష్ణ, హైదరాబాద్ సిటీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ దేవేందర్ చిండాలియా తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శించిన గండ్ర

యశోద ఆసుపత్రిలో దిలీప్‌కు చికిత్స

అక్షరశక్తి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ దిలీప్‌ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. గతంలో తన వద్ద గన్‌మెన్‌గా పనిచేసిన దిలీప్ డ్యూటీ ముగించుకుని హనుమకొండకు వెళ్తుండగా ఆరెపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆసుపత్రికి వెళ్లిన గండ్ర వెంకటరమణారెడ్డి దిలీప్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం దిలీప్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



శివనగర్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

- రోడ్డుపై అలుకు నీళ్లు జల్లి బీజేపీ వినూత్న నిరసన
- పనులు పూర్తికాకుంటే మున్సిపల్ కార్యాలయం, ఎమ్మెల్యే ఇంటి ముట్టడి: గంట రవికుమార్



అక్షరశక్తి, వరంగల్ : వరంగల్ శివనగర్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. డ్రైనేజీ పనుల జాప్యాన్ని నిరసిస్తూ మంగళవారం శివనగర్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. డ్రైనేజీ గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డుపై అలుకు నీళ్లు జల్లుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ శివనగర్ సమస్యలను ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షం పడితే కాలనీలు ముంపునకు గురవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సుమారు రూ.75 కోట్ల నిధులు వెచ్చించినప్పటికీ డ్రైనేజీ పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. నాలుగు నెలల క్రితం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అధికారులతో కలిసి ఇదే రోడ్డుపై సమీక్ష నిర్వహించి పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారని, అయినా పనులు పూర్తి కాలేదన్నారు. డ్రైనేజీ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆడెపు వెంకటేష్, బైరి శ్యాంసుందర్, మార్తా ఉషారాణి, తాళ్లపల్లి శ్రీనివాస్, బండి సుజాత, శెట్టి ప్రవంతి, పిట్టల వెంకన్న, జన్ను ప్రభాకర్, నవీన్, దేవక్క, డివిజన్ కన్వీనర్లు సతీష్, బొడకుంట్ల శివశంకర్, తోట సాగరిక, శెట్టి రమేష్, సూరజ్, జిల్లా పదాధికారులు బన్న ప్రభాకర్, గదల కుమార్, బైరి నాగరాజు, అంకాల జనార్ధన్, మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు, కూచన క్రాంతికుమార్, కర్నె రవీందర్, షేర్ల అనిల్, మోహనాచారి, వీరస్వామి, సాయి, చంద్రమోహన్, సతీష్ కట్టర్, కందుకూరి శ్రీనివాస్, జెట్లింగ్ శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి పుస్తకాన్ని డిజిటలైజ్ చేయాలి





- సెంట్రల్ లైబ్రరీని పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

అక్షరశక్తి, హనుమకొండ: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులు, సాధారణ పాఠకులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం స్థానిక సెంట్రల్ లైబ్రరీని సందర్శించిన ఆమె పూర్తయిన రీడింగ్ హాల్ పనులను పరిశీలించారు. లైబ్రరీలో పుస్తకాల నిర్వహణ, ఇంటర్నెట్ విభాగం, పుస్తకాలను మిషన్ ద్వారా తీసుకునే విధానం, పరిసరాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు. అన్ని రీడింగ్ రూముల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర పోటీ పరీక్షలకు అవసరమైన తాజా స్టడీ మెటీరియల్, పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పుస్తకాలు ఎక్కడ ఉన్నాయో స్పష్టంగా తెలిసేలా నిర్వహణ ఉండాలని, ప్రతి పుస్తకాన్ని డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. లైబ్రరీ ప్రాంగణాలు, పుస్తకాల అల్మారాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం డైట్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో లైబ్రరీ సెక్రటరీ సరిత, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరాకు పటిష్ట ఏర్పాట్లు

అక్షరశక్తి, వరంగల్, అక్టోబర్ 6: బతుకమ్మ నవరాత్రులు, విజయదశమి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉర్సు రంగలీల మైదానంలో పోలీస్ కమిషనర్ శ్వేత, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తొమ్మిది రోజులపాటు మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రధాన రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరారు. రావణ వధ కార్యక్రమానికి సుమారు 5-6 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, ట్రాఫిక్, అగ్నిమాపక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. చిన్నారులు తప్పిపోకుండా తల్లిదండ్రుల మొబైల్ నంబర్లతో ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్‌కుమార్, వైవీ గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవో సుమ, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు



గోపాల్ నవీన్‌రాజు, అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, జనరల్ సెక్రటరీ మెడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, సంయుక్త కోశాధికారి వెలిది శివమూర్తి, కన్వీనర్ మొద్దాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్

అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణ పోలీస్ శాఖలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ ప్రిలిమినరీ కోచింగ్ అందించనున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ అధికారులు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. స్టడీ సర్కిల్ నిబంధనలు, రిజర్వేషన్ రోస్టర్, డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి బి.నిర్మల, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ కె.జగన్‌మోహన్ తెలిపారు. దరఖాస్తుతో ఎస్ఐ/పీసీ పోస్టులకు చేసిన అప్లికేషన్/అక్‌నాలెడ్జ్‌మెంట్, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, టీసీ, కుల, ఆదాయ, రెసిడెన్షియల్, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఈ నెల 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, వడ్డేపల్లిలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. వివరాలకు 9160606862 నంబర్‌లో సంప్రదించాలి.

నిజాం చెరువు పేరు మార్చాలి

బతుకమ్మ చెరువుగా నామకరణం చేయాలి: ఎల్లి మల్లయ్యగౌడ్



అక్షరశక్తి, మహబూబాబాద్: మానుకోట పట్టణంలోని నిజాం చెరువు పేరును మార్చి బతుకమ్మ చెరువుగా నామకరణం చేయాలని బీజేపీ పట్టణ ఇన్‌చార్జి ఎల్లి మల్లయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా చెరువుకు నిజాం పేరు కొనసాగించడం సరికాదన్నారు. నిజాం పాలన, రజాకార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన పలువురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. నిజాం పేరు తొలగించి బతుకమ్మ చెరువుగా నామకరణం చేయడం ద్వారా మానుకోట మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దార ఇందుభారతి, పట్టణ ఉపాధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శులు రవినాయక్, నరేష్‌నాయక్, 28వ వార్డు ఇన్‌చార్జి చుక్కల నరేష్, దగ్గుల సుజాత, సురేష్, అనిల్‌కుమార్, దార మమత, దీపక్‌పటేల్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అక్షరశక్తి, హనుమకొండ: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కోమటిపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలలో వనమహోత్సవం, పెరటి తోట మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించారు. స్ప్రింగ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధ సుమారు 70 నీడ, అందం ఇచ్చే మొక్కలతో పాటు కిచెన్ గార్డెన్ కోసం 20 పండ్ల మొక్కలను విరాళంగా అందించి నాటించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్య ఉద్యానవన అధికారి జె. లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్టార్‌ఫ్రూట్ మొక్కను నాటారు. మొక్కలకు రెండు, మూడు పుట్టినరోజులు జరిగేంతవరకు సంరక్షిస్తే అవి తర్వాత కూడా నిలదొక్కుకుంటాయని అన్నారు. విశ్రాంత గెజిటెడ్ హెడ్‌మాస్టర్ బి.రాధ పిల్లలు తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షుడు, విశ్రాంత డీఎఫ్‌వో కాజీపేట పురుషోత్తం వన ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, ప్రగలపాటి ప్రకాశం, బిల్ల మహేందర్, రాజకుమార్, వి.శ్రీనివాస్, ఫైజూర్ రెహ్మాన్, వెంకటేశ్వర్లు, సువర్ణ, కురాకుల భారతి, ప్రియాంక, కడారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రమీల, విద్యారాణి, జహంగీర్, రాజమ్మ, అరుణ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.